# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **జీఎస్టీ పొదుపు ఉత్సవం ద్వారా దేశంలో స్వదేశీ వస్తువుల కొనుగోలు పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

2. **బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా బలపడిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.**

3. **ఆంధ్రప్రదేశ్ లో మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సిద్ధంగా వుండాలని ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**

4. **తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లకు దశలవారీగా అందించే బిల్లుల చెల్లింపుల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.**

==========================

వస్తు సేవల పన్ను-జీఎస్టీ పొదుపు ఉత్సవం ద్వారా దేశంలో స్వదేశీ వస్తువుల కొనుగోలు పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన్ కీ బాత్-మనసులోని మాట కార్యక్రమం 127వ సంచికలో ఆకాశవాణి ద్వారా పలు అంశాలపై ఆయన నిన్న ప్రసంగించారు. భారత రక్షణ దళాలు భారతీయ సంతతికి చెందిన శునకాల సేవలను ఉపయోగించుకోవడం ఆనందంగా ఉందని, వారి బృందాలలో ఈ శునకాల సంఖ్యను పెంచారని పేర్కొన్నారు. ఈ నెల 31న జరగనున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'ఐక్యతా పరుగు' కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. 2025, నవంబర్ 7న బంకిం చంద్ర ఛటర్జీ స్వరపరిచిన భారత జాతీయ గీతం 'వందేమాతరం'150వ వేడుకల్లోకి అడుగుపెడుతుందన్నారు. జీఎస్టీ బచత్ ఉత్సవ్‌లో భాగంగా పండుగల సమయంలో వస్తువుల కొనుగోలు పెరిగిందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 22 సెకన్లు

--------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని తాడేపల్లిగూడెం వాసి జి.మాణిక్యాలరావు మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా బలపడిందని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ తుఫాను రేపు రాత్రికి తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. మొంథా తుఫాను ప్రభావంతో ఈరోజు నుంచి ఈనెల 29వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి కరుణ సాగర్ తెలియజేస్తూ

వాయిస్ 33 సెకన్లు

మొంథా తుపాను దృష్ట్యా కోస్తా తీర ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధమైంది. తుఫాను పరిస్థితిని ఎదుర్కొనేందుకు విద్యుత్, రెవిన్యూ, త్రాగు నీటి విభాగం వంటి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్న దృష్టా విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలుగకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. తుఫాను సహాయక కేంద్రాలు, ఆస్పత్రులు, సెల్ టవర్లకు నిరంతరం విద్యుత్ సరఫరా అందే విధంగా చర్యలు చేపడుతున్నారు. తెగిపోయిన వైర్లు, ఒరిగి పోయిన విద్యుత్ స్తంభాల వద్ద ప్రజలు ఉండరాదని అధికారులు సూచిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సిద్ధంగా వుండాలని ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. తుఫాను సన్నద్ధతపై అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపు తీవ్రమైన తుఫానుగా మారుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలుతీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా ఎస్ఎమ్ఎస్‌లు, సామాజిక మాధ్యమాల ద్వారా హెచ్చరికలు పంపించాలన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో తుఫాను ముందస్తు చర్యలపై అన్ని శాఖల అధికారులతో ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

మొంథా తుఫాను నేపథ్యంలో తీర ప్రాంతంలో సముద్రం అల్లకల్లోలంగా మారనుందని.. మత్స్యకారులు చేపల వేటకు వెళ్ల వద్దని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. అవసరం అయితేనే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 112, 1070, 1800 425 0101 ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. తుఫాను హెచ్చరికల దృష్ట్యా విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రభుత్వం ఈరోజు, రేపు సెలవు ప్రకటించింది. మొంథా తుఫాను ప్రభావిత 19 జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రత్యేక అధికారులు సహాయక చర్యలు ముందస్తు పునరావాస ఏర్పాటు కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించింది.

మరోవైపు తుఫాను ప్రభావంతో రేపు, ఎల్లుండి తెలంగాణాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

సమాజంలో ఐకమత్యం, శక్తి కీలకమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన 111 చెంచు జంటల సామూహిక వివాహ కార్యక్రమానికి ఆయన నిన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సమాజంలో చెంచులు బలమైన శక్తిగా ఎదగాలని, వారికి సామూహిక వివాహాలు జరిపించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. చెంచులు, ఆదివాసీలు విద్యలో రాణించి గొప్పస్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు.

---------------------------

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లకు దశలవారీగా అందించే బిల్లుల చెల్లింపుల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 90 రోజుల పనిదినాలు, వ్యక్తిగత స్వచ్ఛాలయాల నిర్మాణం పనులను చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో మార్పులు చోటు చేసుకున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో భాగంగా మొదటి, రెండో దశలు పూర్తయిన తర్వాత లక్ష రూపాయల చొప్పున లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు.

---------------------------

చైనాలోని చెంగ్‌డు వేదికగా జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ అండర్-17, అండర్-15 ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెండు స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్యాలతో టోర్నమెంట్‌ను ముగించింది. అండర్-15 బాలికల విభాగం ఫైనల్లో షైనా మనిముత్తు, అండర్-17 బాలికల విభాగం ఫైనల్లో దీక్ష సుధాకర్ స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో జగ్‌శేర్ సింగ్ కాంస్యం గెలుపొందగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో జంగ్‌జీత్ సింగ్, జననిక రమేశ్ జంట కాంస్య పతకం సాధించింది.

======================